క్లుప్తంగా

చికిత్స పొందుతూ రైతు మృతి



నర్సయ్య(ఫైల్)

లక్ష్మణచాంద: గుండెపోటుతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ రైతు మృతి చెందిన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. లక్ష్మణచాందకు చెందిన మారుపాక నర్సయ్య (56) అనే రైతు సోమవారం ఉదయం తన పొలం వద్ద పనులు చేసి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. తర్వాత ఛాతిలో నొప్పి వస్తుందని కుమారుడు సాయంధర్‌కు చెప్పాడు. కుటుంబసభ్యులు వెంటనే నిర్మల్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లగా.. మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బీరువా అందజేత

కుభీర్: మండలకేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు ఇటీవల జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించిన దొంతుల అనిత–లింగన్న రూ.13వేలు విలువైన బీరువాను విరాళంగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈర్ల హన్మండ్లు, పాఠశాల కమిటీ సభ్యులు డి.లింగన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

రెండోరోజుకు నిరాహార దీక్ష



దీక్షకు మద్దతు తెలుపుతున్న గ్రామస్తులు

కుంటాల: మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరుతూ మిషన్ కుంటాల చైర్మన్ దొనికెన వెంకటేశ్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు ఏడాది గడుస్తున్నా.. పూర్తి కాకపోవడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారని వెంకటేష్ పేర్కొన్నారు. ఆయన దీక్షకు పలువురు గ్రామస్తులు మద్దతు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో శ్రీసిద్ధి వినాయకుడి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయంలో పూజలనంతరం యజ్ఞం చేశారు. వైద్యురాలు స్వర్ణారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల అరెస్టు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల ఆశవర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మంగళవారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఆశవర్కర్లను మంగళవారం ఉదయం ఎస్సై సుమలత ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆశవర్కర్లు శారద, రత్నమాల తదితరులున్నారు.

‘షాద్‌నగర్ ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలి’

కుంటాల: వెలమ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అనర్హత వేటు వేసి అరెస్టు చేయాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెలమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ సంఘ సభ్యులు కుంటాల పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సీహెచ్.భాస్కరచారికి ఫిర్యాదు చేశారు. వెలమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఓటీపీలు చెప్పొద్దు

కుంటాల: అపరిచితులు ఫోన్ చేసి అడిగితే ఓటీపీలు చెప్పవద్దని ఎస్సై భాస్కరాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాన్ 2.0 పాన్ కార్డు గురించి దరఖాస్తు చేసుకోండి.. అంటూ పంపే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. అనుమానం వస్తే బ్యాంక్, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు, వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

నియామకం

లక్ష్మణచాంద: మానవ హక్కుల కౌన్సిల్ మండలాధ్యక్షుడిగా సుదర్శన్ నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వారు మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన సుదర్శన్‌ను మండల అధ్యక్షుడిగా ప్రపంచ మానవ హక్కుల కౌన్సిల్ జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్‌కుమార్ నియమించారని తెలిపారు.

నర్సరీ పనులు పరిశీలన

తానూరు: మండలంలోని బోరిగాం, బెంబర, ఉమ్రి(కే) గ్రామాల్లో కొనసాగుతున్న నర్సరీ పనులను మంగళవారం ఈజీఎస్ ఏపీవో గంగాధర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో విత్తనాలు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు

- ప్రారంభమైన మండలస్థాయి ఆటలు
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



నిర్మల్‌లో పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం సీఎంకప్ పోటీలను నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో సీఎం కప్ పోటీలను చైర్మన్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఖామర్ అహ్మద్, జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, ఎస్జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, పేట జిల్లా అధ్యక్షుడు భూక్య రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సీఎంకప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో మండలస్థాయి పోటీలను ప్రారంభించారు. సిబ్బంది, నాయకులు ఉన్నారు.

సారంగాపూర్: మండలకేంద్రంలోని క్రీడా మైదానంలో సీఎంకప్ క్రీడా పోటీలను ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి బాలిక్ అహ్మద్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు, ఎంపీఓ అజీజ్‌ఖాన్, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కడెం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో అరుణ, ఎంఈవో షేక్ హుస్సేన్ సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలంలో ఎంపీవో కవిరాజు, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, పీడీ వెంకటరమణ, రాజేశ్‌నాయక్, ఉన్నారు.

కుంటాల: క్రీడల్లో రాణించాలని సీఎం కప్ పోటీల మండల ప్రత్యేకాధికారి లింబాద్రి పేర్కొన్నారు. కుంటాల ఆదర్శ పాఠశాల ఆవరణలో మండలస్థాయి పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంఈవో ముత్యం, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఎస్సై భాస్కరాచారి, ఏపీవో గట్టుపల్లి నవీన్, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, పీడీలు ముఖీం, మమత, పంచాయతీ కార్యదర్శులు రాజబాపు, యోగేశ్, సతీశ్, శ్రీనివాస్, రమ్య, సాహేందర్, గంగాప్రసాద్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎంకప్ పోటీలను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత ప్రారంభించారు. పీడీ దర్శనం దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

సోన్: ఆటలపోటీల్లో గెలుపోటములు సహజమని.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సీఎం కప్ పోటీలను మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో గోవింద్ ప్రారంభించారు. మొదటిరోజు ఖోఖో, యోగా పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో సురేశ్, ఎంపీవో షేక్ అలీల్ హైమద్, పీఈటీలు లక్ష్మణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో బహుమతులు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం



కుభీర్‌లో క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న ఎంపీడీవో నవనీత్‌కుమార్

బాసర: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్(బాలుర) పాఠశాలలో సీఎంకప్ పోటీలను ప్రారంభించారు. ఎంపీడీవో అశోక్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి రమణ, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంఈవో మైసాజీ, ఎస్సై గణేశ్, ఎంపీవో గంగాసింగ్, హెచ్‌ఎంలు నర్సయ్య, గంగారావు పాల్గొన్నారు. ఈనెల 12వరకు మండలస్థాయి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఖానాపూర్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం కప్ మండలస్థాయి పోటీలు నిర్వహించారు. విజేతలకు చైర్మన్ బహుమతులు అందించారు. ఎంపీడీవో సునీత, ఎంఈవో ప్రేమ్‌సాగర్, ఎంపీవో రత్నాకర్‌రావు, దయానంద్, రమేశ్, శంకర్, సత్యం, పీఈటీలు, తదితరులున్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడీ, ఖోఖో తదితర పోటీలు నిర్వహించగా అన్ని గ్రామపంచాయతీల క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీడీవో నవనీత్‌కుమార్, తహశీల్దార్ ఎం.సోము, ఎస్సై రవీందర్, ఎంపీవో మోహన్‌సింగ్, ఎంఈఓ విజయ్‌కుమార్, పల్సి ప్రధానోపాధ్యాయులు డి.సురేశ్, పీఈటీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మామడ: మండల కేంద్రంలో సీఎం కప్ పోటీలను నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీంరెడ్డి అన్నారు. మంగళవారం మామడలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, తహసీల్దార్ సుధాకర్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సీఎంకప్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో రమేశ్, ఎంపీవో రమేశ్‌రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ యాదవరావు, ఎంఈవో గంగాధర్ తదితరులున్నారు.

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎంకప్ పోటీలను మండల ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ ఏడీ రాజానర్సయ్య ప్రారంభించారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీరాం, డీటీ రవీందర్, ఎంపీడీవో వెంకటరమేశ్, ఎంపీఈవో సోల మాన్‌రాజ్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు ఉన్నారు.



భైంసారూరల్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి



కుంటాల : పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు



సోన్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ సీఈవో గోవింద్



బాసరలో..

తానూరు: మండలకేంద్రంలోని ఆశ్రమ పాఠశాల మైదానంలో సీఎంకప్ పోటీలను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ ప్రారంభించారు. ఎంపీడీవో అబ్దుల్ సమద్, పీఈటీలు, తదితరులున్నారు.

ముథోల్: ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి సీఎం కప్ పోటీలను తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివకుమార్ ప్రారంభించారు. మండలంలోని 10 గ్రామపంచాయతీల నుంచి 300 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సీఐ మల్లేశ్, ప్రిన్సిపాల్ రత్నాకర్, పీడీ మచ్చగిరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

‘ప్రతిపక్షాలను ప్రజలు నమ్మరు’

కడెం: ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు నమ్మరని జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హరితరిసార్ట్స్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు, నీటిట్యాంకులు, ఇతర కార్యాలయాలకు సున్నాలు వేసి.. మేం అభివృద్ధి చేశామని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు శంకర్, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, బబ్లూ, భూషణం, ముస్కు రాజు, రఫిక్, సలీం, శ్రీనివాస్, దినేశ్, తిరుపతి తదితరులున్నారు

పాదుకల దర్శనానికి పోటెత్తిన భక్తులు

ముథోల్: మండలకేంద్రంలోని బసవగార్డెన్‌లో మంగళవారం జిల్లా సేవా సమితి ఆధ్వర్యంలో అనంత శ్రీవిభూషిత జగద్గురు రామానంద శ్రీ స్వామి నరేంద్రచార్యజీ మహరాజ్ దక్షిణ పీఠం నానిజ్ దామ్ సిద్ధపాదుకల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. నెలరోజులుగా గ్రామాల్లో భక్తులు కరపత్రాలు, గోడ పత్రాల ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పటేల్, మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావుపాటిల్, డైరెక్టర్ రాంనాథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ ప్రారంభం

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆసుపత్రికి మంజూరైన 108 అంబులెన్స్ వాహనాన్ని మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. అంబులెన్స్ లేక మండల ప్రజలు అత్యవసర వేళ ఆసుపత్రి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్



సమావేశంలో పాల్గొన్న ఎస్సైలు

ఖానాపూర్: ఖానాపూర్ కోర్టులో ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కోర్టులో ఖానాపూర్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందికి లోక్ అదాలత్ కేసుల విషయమై సన్నాహక సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కేసుల రాజీ కుదుర్చుకునేవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయికుమార్, రుక్మవార్ శంకర్ తదితరులున్నారు.

12న ‘చలో హైదరాబాద్’కు అనుమతివ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్‌లో ఏపీడీ నాగజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లలిత కోశాధికారి శైలజ, జిల్లా అధ్యక్షురాలు విజయ పాల్గొన్నారు.

‘సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించండి’



మాట్లాడుతున్న రవికాంత్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) సంపూర్ణ మద్దతు తెలిపింది. మంగళవారం టీయూటీఎఫ్ నాయకులు సమ్మె శిబిరం సందర్శించి మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సమగ్ర ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తొడిశెట్టి రవికాంత్, వహీద్ ఖాన్‌లు కోరారు. సమ్మెతో విద్యాశాఖలో పనులు పెండింగ్‌లో ఉన్నాయని.. న్యాయమైన డిమాండ్లు, సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మెను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో శరత్ చందర్‌రెడ్డి, మొయిజుద్దీన్ పాల్గొన్నారు.

‘బీజేపీని బలోపేతం చేయాలి’



బాదన్‌కుర్తిలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేసి.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు కె.అంజుకుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు రితీశ్ రాథోడ్.. కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండలంలోని బాదన్‌కుర్తి, చింతల్‌పేట్, మస్కాపూర్ గ్రామాల్లో బూత్ ఎన్నికలు నిర్వహించి పార్టీ గ్రామ అధ్యక్షుల ఎన్నికకు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, అసెంబ్లీ సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ ఆకుల శ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షుడు టీకు ప్రకాశ్, తుప్ప రమేశ్, తిరుమల గిరి, భూమన్న, స్వామి, సురేశ్, లింబాద్రి, రవి తదితరులున్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక..

శక్తి కేంద్రం ఎన్నికల అధికారి పుప్పాల ఉపేందర్, జిల్లా ఎన్నికల సహాధికారి సామ రాజేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. బాదన్‌కుర్తి గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా కందుల కమలాకర్, అంబటి నర్సయ్య, చింతల్‌పేట్ అధ్యక్ష, కార్యదర్శులుగా మర్రి రాజేశ్, మర్రి శంకర్, మస్కాపూర్ అధ్యక్ష, కార్యదర్శులుగా దాడిశెట్టి కృష్ణ, బల్గం రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు.

విగ్రహ మార్పుపై బీఆర్‌ఎస్ నిరసన

నిర్మల్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం మూర్ఖత్వమని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము అన్నారు. తెలంగాణతల్లి విగ్రహ రూపురేఖలు మార్చినందుకు నిరసనగా.. నిర్మల్‌లోని తెలంగాణ భవన్‌లో గతంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పూదరి నరహరి, నెల్ల అనిల్, లక్ష్మణచారి, విశాల్, హరీశ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని కొత్తబస్టాండ్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల గంగాధర్, సాయినాథ్, కిషన్, రాజు, పోశెట్టి, రాజు ఉన్నారు.

కుభీర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు గతంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మండలాధ్యక్షుడు అనిల్, మాజీ మండలాధ్యక్షుడు మొయినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ రేకుల గంగాచరణ్, నాయకులు పీరాజీ, దొంతుల లింగన్న, దత్తాత్రి, రాజన్న, మాజీ సర్పంచ్ జి.బాబు, సంజీవ్ తదితరులు ఉన్నారు.



నిర్మల్‌లో తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కడెం: బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ పిలుపుమేరకు మండలకేంద్రంలోని తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, శ్రీకాంత్, రాముగౌడ్, రఫీక్, రాజేశ్వర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, గంగన్న, లచ్చన్న తదితరులున్నారు.



కుభీర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో గతంలో ఏర్పాటు చేసిన పాత తెలంగాణతల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా విగ్రహం రూపు మార్చడం హేయమైన చర్య అని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజగంగన్న, రాజు, ఖలీల్, గజేందర్, సుమన్, కళావతి, రమేశ్, ఎర్రన్న, షఫి, షోయబ్, ఫైసల్, భీమేశ్, గంగేశ్, నాగరాజు, రాజేశ్వర్ తదితరులున్నారు.

మండల కార్యవర్గం

మామడ: ఫొటోగ్రాఫర్ల సంఘం మండల కార్యవర్గాన్ని మంగళవారం మండలకేంద్రంలో ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా పాకాల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా మెట్టు సుధాకర్, ఉపాధ్యక్షుడిగా కాల్వ అశోక్, కోశాధికారిగా మూగల రత్నయ్య, గౌరవ అధ్యక్షుడిగా రమేశ్, సభ్యులుగా సురేశ్, చంద్రశేఖర్, గంగాధర్, విలియం, శ్రీనివాస్, వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అయిట్ల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసకృష్ణస్వామి, సగ్గం వంశీ ఉన్నారు.

అడవులను సంరక్షించాలి

ఖానాపూర్: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని సింగాపూర్ ఎఫ్‌ఎస్‌వో మహ్మద్ జాఫర్ అన్నారు. మామడ మండలం దిమ్మదుర్తి రేంజ్ పరిధిలోని ఖానాపూర్ మండలం సింగాపూర్ పంచాయతీ పరిధి గోండుగూడలో ప్రజలకు అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. రాజూరా ఎఫ్‌బీవో కమలాకర్, నాయకులు శ్రీధర్, లక్ష్మణ్, సురేశ్ ఉన్నారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో రాణించాలి



బహుమతులు అందిస్తున్న ఎంఈవో నరేందర్

తానూరు: దివ్యాంగులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో రాణించాలని ఎంఈవో నరేందర్ సూచించారు. దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో మాట్లాడారు. పాఠశాలలో 40 మంది దివ్యాంగులు చదువుతున్నారని.. వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పలు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిబాబు, ఉపాధ్యాయులు రాములు, రోజారాణి సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాల్యవివాహం చేయొద్దు

తానూరు: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని.. చిన్నవయసులో వివాహం చేయకుండా చదువు చెప్పిస్తే ఉన్నతస్థానాల్లో నిలుస్తారని అధికారులు కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని ఎల్వి గ్రామంలో వచ్చేవారంలో బాల్యవివాహం చేస్తున్నారనే సమాచారం అందడంతె తహసీల్దార్ లింగంమూర్తి, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎస్సై రమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత బాలిక ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ చేశారు. చదువు ప్రయోజనాలు, బాల్యవివాహంతో కలిగే నష్టాలను వివరించారు. దీంతో కుటుంబసభ్యులు బాలికకు చదువు చెప్పించేందుకు అంగీకరించారు.

నేడు బస్‌పాస్ మేళా

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులు సదరం సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, పాస్ ఫొటో, రూ.50 వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

భైంసాటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం శిక్షణ అందించాలని ఆర్‌ఎంపీల సంఘం అసోసియేషన్ డివి జన్ అధ్యక్షుడు మోహన్ కోరారు. మంగళవారం పట్టణంలో మాట్లాడుతూ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఆర్‌ఎంపీల శిక్షణ ఇస్తామని ఇచ్చిన హామీని ఇప్పటికీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. తనిఖీల పేరిట ఆర్‌ఎంపీల ప్రథమ చికిత్స కేంద్రాలపై కేసులు నమోదు చేయడం సరికాదని వాపోయారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్, మండలాధ్యక్షుడు అర్జున్, ఉపాధ్యక్షులు సునీల్, సాయికుమార్, కోశాధికారి తుకారాం పాల్గొన్నారు.